
మినీకథ

# ఆ రాత్రి

విశాఖపట్నం బీచ్ ఒడ్డున కాలం గడిపేస్తూ మధ్యలో అందులో వేసవిలో ఏదైనా ఊరెళ్ళాలంటే చచ్చేంత జెంగ. అయినా ఏవో పన్లు పడక మానవుకదా. అలాగే అనుకోకుండా బయల్దేరి వెళ్ళాము. కైకలూరు పశ్చిమగోదావరి జిల్లాలో ఉంది. ఏలూరు నుండి పూర్ణ, విజయవాడ నుండి శకుంతల కూడా వచ్చారు. ఏవో ఉద్యోగాల్లోపడి ఎవరికి వాళ్ళం కొట్టుకుంటూ ఉన్నా కాసేపు మాట్లాడుకోవచ్చునే సరదా! మేము వెళ్ళిన పని రెండు రోజుల కార్యక్రమం. మొదటి రోజు రాత్రి ఎక్కడుండాలి? అనుకుంటుంటే ఓ తెలిసిన రాజు గారు వాళ్ళ. గెస్టుహౌస్‌లో ఉండమన్నారు. ఊరు చివర డొంకల దారిలోపడి నడుచుకుంటూ పోతే ఓ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒంటి స్తంబం మేడ. రెండు రూములు, బాల్కానితో రాత్రి వాళ్ళు పెట్టిన భోజనంతిని కూర్చున్నాము. పౌర్ణమి వెళ్ళి. రెండు రోజులైంది. ఆవాల్టికి. గెస్టుహౌస్ చుట్టూ చేపల చెరువులు, దూరంగా గట్లమీద కొబ్బరిచెట్లు. మనిషి జాడ లేదు. అంతా చికటి. నిర్మానుష్యం! దూరంగా ఎక్కడో ఏదో కారు, లారీ వెళ్తున్న వెలుగు అప్పుడప్పుడు కన్పిస్తోంది. చిన్నప్పట్నుంచి కాస్త అల్లరి చేయడం అలవాటేమో ఏవో జోకులు వేసుకుంటున్నాం. చంద్రుడు వెన్నల మనుషుల్ని ఎప్పుడూ కాప్టివ్ చేస్తూనే ఉన్నా! ఎప్పడ కొత్త అనుభవంగానే ఉంటాయి. నిజంగా ప్రకృతిలో ఎంత కొత్తదనం, తాజాదనం. మనం రెండు రోజులు మొహాలు చూసుకొంటే మూడో రోజు విసుగొస్తుంది. అలా చంద్రుడు మరీ గుండ్రంగా కాక కాస్త ముక్కలేనట్లుగా ఉన్నాడు. గాలివీస్తూ ఆ చెరువు నీళ్లను అలలగా మారుస్తుంది. వెన్నెలదారి ఆనీళ్ల మీద కదుల్తూ ...అప్పటివరకు చీకట్లో చేప ఎగిరిన చప్పుడు చిన్న మెరుపులా కన్పించేది. యిప్పుడు ఎన్నివేల మెరుపులు చేపలు మిలమిల్లాడుతూ పట్నంలో దుమ్ముకొట్టుకుపోయిన కళ్ళు. ఆ వెన్నెల్లో నీళ్ల రిఫ్లక్షన్‌కి కడిగేసినట్లవుతున్నాయి. దాహం తీర్చుకోడానికొచ్చిన జింకల్లా ఆ వెన్నెల్లో పీల్చుకుంటూ ఉండిపోతున్నాయి. అస్సలు నిజంగా ఓ అందమైన దృశ్యం చుడ్డానకి మన కళ్ళు తపిస్తాయని, దాహంగా ఆర్చుకు పోయంటాయని అప్పుడే తెల్సింది. ఎన్ని గంటలు ఆ నిశ్శబ్దంలో నిర్మానుషత్వంలోని ఆనందాన్ని పీల్చుతూ... మధ్యలో ఒకళ్ళకైనా పాటలు రావని విచారించాం. ఏదో పాటందుకుంది శకుంతల. నేను తక్కువ అని తలత్ మొహముద్‌ని, ముఖేష్‌ని క్షమించమని మనస్సులో వేడుకొని "ఏదిల్ ముఝే ఐసీ జగాలేచల్ జహ కోయి నహీ" అందుకున్నాను. గుండెనిండా ఏదో ఆనందం నింపేస్తోంది.

చంద్రుడు పైకెళ్తున్నకొద్దీ అలలమీద మెరుపుల్లో మార్పు అది చూస్తున్న వాళ్ళకే తెలు



స్తుంది. చుట్టూ కొన్ని కిలోమీటర్ల వరకు చెరువులు జనసంచారం లేదు. గట్టిగా పాటలు పాడుతూ మళ్ళీ నిశ్శబ్దంలోకి ఎవరి లోకంలోకి వాళ్ళం జారిపోయాం. ఎంత బావుంది ఈ రాత్రి. చెరువు నిండా మిణుగురు పురుగులు వాలినట్లు మిలమిల! యింత సౌందర్యం యాచిన్నవూళ్లో దాక్కొని ఉందా! ఆ సాయంత్రం మేము వెళ్ళిన వాళ్ళింటావిడ గుర్తుకొచ్చింది. ఆరోగ్యం బాగులేక మానసికంగా ఏదో పోగొట్టుకున్నట్లు ప్రవర్తిస్తుంటే పరీక్షలు చేసి డాక్టర్లు కరెంట్‌షాక్ యిచ్చినట్లు చెప్పడం గుర్తుకొచ్చింది. మనుషుల్ని ఎంత ఆనందపు టంచుల కు తీసుకుపోతున్నా! యీ వాతావరణానికి సరిగ్గా కొన్ని ఫర్లాంగుల దూరంలో, తనలోతాను కుచించుకుపోయి, తాను ఎందుకూ పనికిరానని, ఏమిచెయ్యలేనని మథనపడుతూ ఆరోగ్యాన్ని పోగొట్టుకొన్న ఆమె. నిజంగా ఏ సాయంత్రమో, ఏ వెన్నెల రాత్రో తన కుతానుగా ఆనందించడానికి కేటాయించుకుంటే ఆ స్థితికి వచ్చేదా! ఆలోచనల్ని కాస్త పక్కనపెట్టి మళ్ళీ అలల్నిచూస్తూ కూర్చున్నా. రాత్రి ఒంటి గంటవుతోంది. లోపలకు వెళ్ళలేక కుర్చీలుతీసి ఆ బాల్కానీలోనే దిండుతెచ్చుకొని వేసుకొని నేల మీద పడుకున్నాం. యిప్పుడు వలవేసి పడ్తే చేపలు ఎగుర్తూ నక్షత్రాల్లా మెరుస్తాయి. వెన్నెల తునకలు వలనిండా పడి చేపలా ఎగురుతాయి. అర్థం కావడం లేదు.

మాచిన్నప్పుడు బయట వీధిలో పడుకొని నక్షత్రాల్ని చూస్తూ, అవి ఎక్కడున్నాయో, ఎక్కడికి మారాయో మాట్లాడు కోవడం గుర్తుకొచ్చింది. వెన్నెల్లో బీరపువ్వులు పచ్చగా మెరుస్తూ వింత సువాసనని వెదజల్లుతుండడం గుర్తుకొచ్చింది.

బయట ఆకాశం, నక్షత్రాలు, మబ్బులు వెన్నెల, చల్లని గాలి, కెరటాల్ని వదిలేసి టి.వి.ముందు స్టార్‌ప్లస్ చూస్తున్న మాచిన్నోడు గుర్తుకొచ్చాడు.

అలా ఎప్పుడు నిద్రపోయామో తెలీదు. తెల్లారి వాచ్‌మెన్ పిలిచేవరకు ఎవరము నిద్రలేవలే! తయారై బయటికిపోయి రిక్షాలో వెళ్ళిపోయాము. అ గెస్టుహౌస్‌ని, ఆ చెరువుల్ని వెనక్కితిరిగి చూసుకొంటూ. ఆ ఒక్కరాత్రి మాకిచ్చిన ఆనందాన్ని ఎన్నో రోజులు పదిలంగలా దాచుకోవాలో! పొదుపుగా వాడుకోవాలో! రాత్రి చీకట్లోవచ్చిన డొంక దారి వెంట వెళ్తూచూస్తే! చాలా చెరువులు బురదగా ఎండిపోయి ఉన్నాయి. అక్కడ చేపలు పెరగడానికి వాళ్లు వేసే రసాయనాలు, ఆహారం కుళ్ళిపోయి చుట్టుప్రక్కల కాలుష్యం పెరుగుతోందని చెప్పడం విన్నాం. నిజంగా నూతినీళ్ళలో యింకిపోయి ఆరోగ్యాలు చెడడం కూడా విన్నాం. యింతకూ అంత కాలుష్యం ఉన్న నీటిలోంచి ప్రతిఫలించి మమ్మల్ని ట్రాన్స్‌లోకి తీసుకుపోయిన ప్రకృతిని అభినందించాలో, తన కాలుష్యాన్ని బయటపడనివ్వకుండా రంగుల్తో మిరుమిట్లుగొలుపుతూ మమ్మల్ని ఆ చెరువులు ఫూల్స్ చేసాయనుకోవ్వాలో! మనిషిలోని ఓ అందానికి చలించిపోయే లక్షణానికి ఈ లాజికల్ థింకింగ్‌ని కలుపకపోవడం మంచిదేమో.

—ఎన్.శైలజ.